జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



# 22ఏ, భూ స్వేచ్ఛపై..

# 26న ప్రత్యేక డ్రైవ్



* నిషేధిత భూములపై వినతులు అందించండి
* గత ప్రభుత్వ తప్పిదం వల్లే 22ఏ జాబితాలోకి భూములు
* భూస్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలి
* రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* రెవెన్యూ అధికారులతో సమీక్ష



**శ్రీకాకుళం,డిసెంబరు23(వార్త):** జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 26న ఉదయం 9.30, గంటలకు మీ చేతికి.. మీ భూమి 22ఏ భూస్వేచ్ఛ పేరుతో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నిషేధిత భూముల విషయమై ఎవరైనా విజ్ఞాపనలు చేసుకోవచ్చని, సంబంధిత అర్జీలను రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధిత వర్గాలకు పూర్తి న్యాయం చేస్తారని వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే 22ఏ జాబితాలో నిషేధిత భూముల విషయమై కేబినెట్‌లో చర్చించినట్లు మంత్రి అచ్చెన్న వివరించారు. ఇందుకు అనుగుణంగా భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం భూముల రీసర్వే పేరిట రికార్డులను అన్నింటినీ అస్తవ్యస్తం చేశారని, వీటిని గాడిలో పెట్టేందుకు, ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించేందుకు, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అర్హత ఉండి, గత పాలకుల తప్పిదం కారణంగా 22ఏ జాబితాలోకి చేరిన భూముల విషయమై తమ దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత చర్యలను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం దక్కేలా చేస్తామన్నారు. 22 ఏ, 22-1 ఏ, 22-1 బీ, 22-1సీ, 22-1 డీ జాబితాలలో గత పాలకుల తప్పిదం కారణంగా ఎవరైనా చేరి పోయి ఉంటే, రెవెన్యూ అధికారులు నిర్వహించే భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్లకు చెందిన ఆర్డీఓలు, అన్ని స్థాయిలలో పనిచేస్తున్న రెవెన్యూ యంత్రాంగం హాజరవుతుందని, జిల్లా కలెక్టర్ వీరికి మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు.

## ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి

గత ప్రభుత్వ హయాంలో తప్పుడు పత్రాలు సృష్టించి కోట్ల విలువైన భూమిని అన్యాయంగా దోచుకుని, స్వాధీనం చేసుకున్నారని వీటిపై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లకు రాష్ట్ర వ్యవ సాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గత పాలకుల తీరు కారణంగా అన్యాక్రాంతమైన పేదల భూమి చట్టపరంగా, న్యాయపరంగా తిరిగి ప్రభుత్వానికే దక్కే విధంగా ఆధార సహితంగా సంబంధిత అన్ని పత్రాలూ ప్రభుత్వం దగ్గర ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఇకపై అన్యా క్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఇటువంటి ఘటనలలో గత పాల కుల అండతో.. రికార్డులు తారుమారు చేసిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గ కేంద్రంగా ముఖ్యమైనటువంటి రైతు బజార్, సుమారు ఇరవై ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమణలకు గురి చేశారని, వాటిని కూడా తిరిగి ప్రభుత్వ పరిధిలో తీసుకుని, తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. టెక్కలి నియోజక వర్గానికి సంబంధించి భూముల ఆక్రమణలపై సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి సమస్య పరి ష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఆక్రమిత స్వర్ణకారుల సంఘానికి స్థలం (చింతలగార, సర్వే నంబర్ 7లో 20 ఎకరాలు) వెంటనే స్వాధీనం చేసుకోవాలని హుకుం జారీ చేశారు. అలానే టెక్కలి మిస్సమ్మ బంగ్లా ఆక్రమణలో ఉందని, దీనిని కూడా స్వాధీనం చేసుకోవాలని, టెక్కలి రైతు బజారుకు చెందిన ప్రభుత్వ స్థలం ఆక్రమణలో ఉందని, దీనిని కూడా వెంటనే ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం రెవిన్యూ డివిజన్‌ల అధికారులు పాల్గొన్నారు.

### 26న రథసప్తమిపై

# ప్రజాభిప్రాయ సేకరణ

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం,డిసెంబరు23(వార్త):** అరసవల్లి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, అత్యంత వైభవంగా నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 25న జరగనున్న వేడుకలను ఈసారి ఏడు రోజుల పాటు రాష్ట్ర పండుగగా జరిపేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆలయ సంప్రదాయాలు తెలిసిన పెద్దలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), వ్యాపార, రవాణా రంగాల ప్రతినిధులతో పాటు సామాన్య భక్తులు కూడా హాజరై తమ సలహాలు అందజేయవచ్చని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఉత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణపై ఎవరైనా తమ అమూల్యమైన సూచనలు ఇవ్వవచ్చని, వాటిని నిశితంగా పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, అరసవల్లి ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు సహా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

* పాతపట్నం సీఐ సన్యాసి నాయుడు
* డ్రగ్స్‌కి వ్యతిరేకంగా మెళియపుట్టిలో అభ్యుదయం సైకిల్ యాత్ర

**మెళియాపుట్టి, డిసెంబరు 23(వార్త):** మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలానికి అభ్యుదయం సైకిల్ యాత్ర చేరుకుంది. చాపర జంక్షన్ నుంచి మెళియాపుట్టి వరకూ ఈ యాత్ర భారీగా సాగింది. యాత్రలో పాల్గొన్న బృంద సభ్యులకు పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి పౌరుడు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాల సమాచారాన్ని 1972 లేదా 112 నంబర్లకు తెలియజేయా లన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### రైతులు అంగీకరిస్తే..

# ల్యాండ్ పూలింగ్

* ఎయిర్ పోర్ట్‌తో బాధిత రైతులకు నష్టం జరగనీయం
* కార్గో ఎయిర్ పోర్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు
* రైతులతో జిల్లా అధికారుల చర్చలు



**మందస, డిసెంబరు23(వార్త):** రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం నుంచి ల్యాండ్ పూలింగ్ విధానం తీసుకువచ్చి, రైతులకు ఆదుకుంటామని కార్గో ఎయిర్ పోర్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. మందస మండలంలోని ఎం.గంగువాడ గ్రామంలో రైతులతో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధిత రైతులు అంగీకరిస్తే ఎకరాకు 25సెంట్లు భూమి తిరిగి ఇస్తామని, ఏ ఒక్కరి ఇల్లుకి నష్టం లేకుండా ప్లాన్ చేశామన్నారు. జిరాయతీ తోటల్లో ఉన్న చెట్లకు ప్రత్యేక ధర ప్రకటిస్తామని, ప్రభుత్వ ధర కన్నా 2.5 రెట్లు అధికంగా చేసి ప్రభుత్వం తరుపున ఇస్తామని చెప్పారు. అనంతరం కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు మాట్లాడుతూ స్థిరాస్తి భూమిపై మేము బతుకుతున్నామన్నారు. కార్గో ఎయిర్ పోర్టుతో మేము చాలా ఎక్కువగా నష్టపోతామన్నారు. గ్రామ ప్రజలతో కలిసి గత సంవత్సరం కాలం నుంచి వివిధ రూపాలలో పోరాటం చేస్తూ ప్రభుత్వానికి కార్గో ఎయిర్ పోర్ట్ వద్దని తెలియజేయడం జరిగిందని, ఇంకా ఎన్నాళ్ళు మమ్మల్ని మానసికంగా ఇబ్బంది పెడతారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు మాట్లాడుతూ నేటికి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆర్.డి.ఓ కార్గో ఎయిర్ పోర్ట్ కి సంబంధించిన రైతులు ఎంతమంది ఉన్నారు.. కార్గో ఎయిర్ పోర్టుకి ఎంత భూమి కావాలో ఒక క్లారిటీ ఇవ్వకుండా సుమారు 20 గ్రామాల్లో బాధిత రైతులను మానసికంగా ఇబ్బంది పెట్టడం కరెక్టు కాదన్నారు. కార్యక్రమంలో మందస మండల తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, ఆర్ఐ ఇందిర, సచివాలయం సెక్రటరీ, వి.ఆర్.ఓ. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుంటు పాపారావు, రత్నాల చలపతి, పొట్టి మోహన్, నల్ల పరుశురాం, గుంటు లోకనాథం, గుంటు రామస్వామి, పొట్టి యోగేశ్వర్ రావు, నెమలపురి సత్యం, గుంటు జోగిరాజు, పొట్టి జ్యోతి, కొమర పుణ్యవతి, మైలపల్లి భోగమ్మ, యువకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



### వదిలింది.. అధ్యక్ష పదవినే..

# రాజకీయాలను కాదు



* అధిష్టానం నిర్ణయానికి గౌరవించా
* రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న ఆలోచన లేదు
* ప్రజల కష్టసుఖాల్లో నేనుంటా.. నా కష్టసుఖాల్లో వారుంటారు
* త్వరలో ప్రజల మధ్యకు వెళ్తా
* మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

**కొత్తూరు, డిసెంబరు23(వార్త):** మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న వదంతులను ఖండించారు. 'నేను వదిలింది కేవలం పార్టీ అధ్యక్ష పదవినే, కానీ పార్టీని కాదు, రాజకీయాలను అసలే కాదు' అని ఆయన స్పష్టం చేశారు. కొత్తూరులోని మాతల క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తాజాగా ఒక టెలివిజన్ చానల్‌లో ప్రసారమైన క్లిప్ తన అసలైన మాటలను వక్రీకరించినదని పేర్కొన్నారు. 'ఆ క్లిప్ కూడా గత ఎన్నికల సమయంలో జరిగిన రాజకీయ కుట్రల మాదిరిగానే మరో ప్రయత్నం కావొచ్చు' అని వ్యాఖ్యానించారు. 'నేను తప్పుకున్నది అధ్యక్ష పదవి మాత్రమే.. అది కూడా పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తూ. కానీ పార్టీని వదిలి పెట్టాలనే ఉద్దేశం ఎప్పుడూ లేదు, రాజకీయాల నుంచి తప్పుకోవాలన్న ఆలోచన కూడా లేదు' అని కలమట స్పష్టం చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో తమ కుటుంబానికి గత ఆరు దశాబ్దాలుగా ప్రజలు ఇచ్చిన నమ్మకం, తమకు ఉన్న బలం అని చెప్పారు. 'ప్రజల కష్టసుఖాల్లో నేనుంటాను, నా కష్టసుఖాల్లో ప్రజలు ఉంటారు.. ఇదే మా సంబంధం' అని అన్నారు. గత ఎన్నికల్లో కొన్ని అనివార్య పరిస్థితుల వలన టికెట్ పొందలేకపోయినా, పార్టీ బలోపేతం కోసం భవిష్యత్తులో మరింత కృషి చేస్తానని కలమట తెలిపారు. 'త్వరలోనే ప్రజల మధ్య మునుపటిలాగా చురుకుగా ఉంటాను. నా రాజకీయాలపై అనవసర అపోహలను పక్కన పెట్టాలి' అని ఆయన కార్యకర్తలను, ప్రజలను కోరారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## స్టడీ మెటీరియల్ పంపిణీ

**మందస, డిసెంబరు 23(వార్త):** యూటీఎఫ్ ప్రచురించిన ఎస్ఎస్సీ స్టడీ మెటీరియల్ ను పల్లి సారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు గున్న జయప్రద, మధుసూదనరావులు యూటీఎఫ్ ప్రచురించిన ఎస్ఎస్సీ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ మంచి మార్కులు పొందడానికి సహకరిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థి దశలో 10వ తరగతి జీవితాన్ని మలుపు తిప్పేదని, ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివితే తప్పనిసరిగా విజయం సాధించగలరన్నారు. సర్పంచ్ బత్తిన కుసుమ హేమంతరావు, ఎస్ఎంసీ చైర్ పర్సన్ దున్న కవిత, వైస్ చైర్ పర్సన్ టి.లక్ష్మణరావులు మాట్లాడుతూ స్వచ్ఛందంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి, పిల్లల విద్యాభివృద్ధికి సహకరించినందుకు గ్రామం తరపున ధన్యవాదాలు తెలియ చేశారు. ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గుంట కోదండరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.పాపారావు, బి.అన్నపూర్ణ, ఎన్.విష్ణుమూర్తి, ఎం.హరనాథ్, కె.నాగభూషణ్, టి.శివాజీ, ఆర్.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలకు పలాస విద్యార్థులు




**పలాస, డిసెంబరు 23(వార్త):** రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన వారికి ఈనెల 10వ తేదీ నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్ర పోటీలకు హాజరవ్వాలని పలాస గోపీచంద్ స్కేటింగ్,రోలర్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ బి చంద్రావతి కోరారు. సోంపేటలో జరిగిన జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు, రాష్ట్ర పోటీలకు ఎంపికలు నిర్వహ%శీ%చారు. ఈ ఎంపికలో పలాసకు చెందిన గోపీచంద్ రోలర్ స్కేటింగ్ క్లబ్, రోలర్ స్పోర్ట్స్ అకాడెమీ విద్యర్థులు బాలికల 8 సంవత్సరాల విభాగంలో జక్కల తోషిని రాయ్, బాలురు విభాగంలో అట్టడ ఐయ్యాన్, నారాయణశ్ టి . పార్థు సాయిలు ఎంపిక అయారని శ్రీకాకుళం స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. షణ్ముఖ రావు తెలిపారు. ఎంపికైన వారు 10 జన వరి నుండి 11 జనవరి వరకు తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహిస్తారని చెప్పారు. ఎంపికైన వారికి క్లబ్ సభ్యులు, కోచ్ బి.చంద్రావతి అభి నందనలు తెలిపారు.

## కాశీబుగ్గ సీఐతో మర్యాదపూర్వకంగా భేటీ



**పలాస, డిసెంబరు 23(వార్త):**కాశీబుగ్గ సిఐ వై రామకృష్ణతో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసిన విశ్రాంతి మెడికల్ అధికారి మూలకామేశ్వరరావు, వైసీపీ నాయకులు సాసుమాన శ్యామ్ సుందర్ శివాజీ నాయుడు రోటరీ నగర్ కాశీబుగ్గ చెందినవారు మన పలాస కాశీబుగ్గ సిఐకి కలిశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల సహకారం ఉంటేనే శాంతి భద్రతలకు డొక ఉండదని, మీ అందర అభిమానం చూపాలని సిఐ ఆకాంక్షించారు.

## పీపుల్స్ స్టార్‌తో... వజ్జ



**పలాస, డిసెంబరు 23(వార్త):** పలాసలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పీపుల్ స్టార్ విప్లవ కథానాయకుడు,దర్శక నిర్మాత ఆర్. నారాయణ మూర్తి మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నూతన చిత్రం యూనివర్సిటీ ప్రమోషన్ లో భాగంగా పలాస వచ్చిన నారాయణమూర్తి గారు బాబూరావుని కలుసుకున్నారు. నేడు విద్యారంగంలో జరుగుతున్న దోపిడీని ప్రశ్నించే చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు.

## క్రిస్మస్ వేడుకల్లో అన్వేష్



**ఇచ్ఛాపురం, డిసెంబరు 23(వార్త):** క్రిస్టమస్ పురస్కరించుకొని పలాస లో జరిగిన వేడుక ల్లోమాజీ మంత్రివార్యులు సిదిరి. అప్పలరాజు తో పాటు డా . ప్రత్తి అన్వేష్ (వై ఎస్ ఆర్ సి పి స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి) పాల్గొన్నారు. ఆఫీసు చాంబర్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి అప్పలరాజు కేక్ కటింగ్ చేశారు. ప్రత్యేకమైన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దువ్వాడ. రవి, దువ్వాడ మధు, సిస్టిని గోపి, ఎన్ వి రమణయ్య,ఉంగ సాయి కృష్ణ, బత్తినీ హేమేశ్వరరావు, దైవ సేవకులు పాల్ , పాస్టర్ ఏలీయా , భీమ్ బెహరా దైవ సేవకులు పాల్గొని ప్రార్థన లు చేశారు,క్రిస్మస్ వేడుకలు ఘనము గా ముగించారు.

## జ్ఞానభారతిలో క్రిస్మస్ వేడుకలు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 23(వార్త):**జ్ఞాన భారతీ స్కూల్లో కార్యదర్శి సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయగా, విద్యార్థులు క్రిస్మస్ నేపథ్యంతో కూడిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ... విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. జీసస్ బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులందరూ సోదరుభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐబి పండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




# శాఖల వారీగా కడిగి పారేశారు..!

- ప్రభుత్వ వైఫల్యాలు, అధికారుల తీరుపై ధ్వజమెత్తిన మండల సభ్యులు
- ధాన్యం దోపిడీ..హౌసింగ్ గారడీపై మండిపాటు
- అన్నదాతను దగా చేస్తున్నారని ఆక్రోశం
- ఇళ్ల పేరిట పేదల నుంచి డబ్బులు వసూలుపై తీవ్ర ఆగ్రహం
- వాడీవేడిగా సోంపేట మండల సర్వసభ్య సమావేశం




**సోంపేట, డిసెంబరు 23(వార్త):**సోంపేట మండలంలో మిల్లర్ల దోపిడీ యథేచ్ఛగా సాగుతుందని, రైతులు నిలువునా దగా పడుతున్నారని మండల సర్వసభ్య సమావే శంలో సభ్యులు ధ్వజమెత్తారు. హౌసింగ్ విషయంలో ప్రభుత్వ ఆదేశాలు లేనప్పటికీ ఇళ్లు మంజూరు చేస్తామంటూ హౌసింగ్ సిబ్బంది, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో పేదలను మభ్యపెట్టి ఫొటోలు తీసి, లేని ఇళ్లకు లంచాలు వసూలు చేస్తున్నారని సభ్యులు ఆరోపిస్తూ మండల హౌసింగ్ ఏఈ రవిచంద్రను నిలదీశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మాన దాసు అధ్యక్షతన.. ఎమ్మెల్సీ నర్తు రామారావు గౌరవ సభ్యునిగా హాజరైన మంగళవారం నాటి సర్వసభ్య సమావేశం అనేక సమస్యలపై వాడీవేడిగా జరిగింది. వ్యవసాయ శాఖ అంశంపై జరిగిన చర్చలో ట్రాక్టర్లతో మిల్లులకు తరలిస్తున్న ధాన్యం లోడ్లు ఏ కాలంలో ప్రైవేటు వే బ్రిడ్జి కన్నా మిల్లర్ల వద్ద వేబ్రిడ్జిపై 50 నుంచి 100 కిలోలు తక్కువగా చూపిస్తూ రైతాంగాన్ని ఎన్నడూ లేనివిధంగా నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నారని, ప్రతి బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు అదనంగా వసూలు చేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎంత దోపిడీ జరుగుతున్నా ఏ ఒక్క శాఖ కూడా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై వ్యవసాయ అధికారి నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణ శాఖ తీరుపై సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకుండా ఇల్లు మంజూరయ్యాయంటూ వీధుల్లోనూ గ్రామాల్లోనూ సర్వేలు చేస్తూ పేదవారికి ఇంటి వద్ద నిలబెట్టి ఫొటోలు తీస్తూ వారి నుంచి ఏకంగా డబ్బులు కూడా వసూలు చేస్తున్నట్లు సభ్యులు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో అర్హుడైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కూడా అందజేసిందన్నారు. అప్పుడు లేని పేదలు ఈ రెండేళ్లలో కొత్తగా ఎక్కడ పుట్టుకొచ్చారని ఏఈని నిలదీశారు. ఇలా ఇళ్ల మంజూరు కోసం చేస్తున్న వ్యవహారాల్లో, అందుకు సంబంధించిన ప్రతిపాదన జాబితాలను రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచులు ఎంపీటీసీలకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. సమావేశంలో పాల్గొన్న కార్యదర్శులను కూడా నిలదీయడంతో మాకు ఎటువంటి జాబితాలు అందలేదని చెప్పడంతో సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బారువాలో పనిచేస్తున్న సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ ఏకంగా అధికార పార్టీ కార్యకర్తలతో వెళ్లి పేదల ఇళ్ల వద్ద సమావేశాలు నిర్వహించి కొత్తగా ఇల్లు మంజూరు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జాబితాలు అందించని ఎంపీడీవోపై సైతం సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

### విద్యాశాఖపై ..

విద్యాశాఖపై జరిగిన చర్చలో సభ్యులు జోగారావు, శ్రీకృష్ణ, మాధవరావు, ఎంపీపీ దాసు అడిగిన పలు ప్రశ్నలకు ఎంఈఓ జరాడు సమాధానాలు స్పష్టంగా చెప్పకుండా నీళ్లు నమిలారు. తల్లికి వందనం పథకంలో ఒక్కొక్క విద్యార్థి నుంచి 2000 చొప్పున వసూలు చేసిన ప్రభుత్వం ఆ నిధులను ఏమి చేసిందని నిలదీశారు.

### విద్యుత్ శాఖపై..

విద్యుత్ శాఖపై జరిగిన చర్చలో బారువా పంచాయతీకి సోంపేట నుంచి అదనపు ఫీడర్ వేయాలని విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపాలని బారువ సర్పంచ్ రజనీకుమారి, వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, సర్పంచ్ జోగారావు తదితరులు డిమాండ్ చేశారు. తీర గ్రామాలైన ఎకువూరు నడుమూరు బట్టిగల్లూరులో సముద్రపు గాలి తాకిడికి విద్యుత్ తీగలు తుప్పు పట్టి తెగిపోతున్నాయని వీటిని సత్వరం మార్చి ప్రమాదాలు నివారించాలని సర్పంచ్ బట్టి మాధవరావు కోరారు.

### వైద్య శాఖపై ..

వైద్య శాఖపై జరిగిన చర్చలో గత ప్రభుత్వం ఆసుపత్రులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి, అభివృద్ధి చేసిందని వైద్యులను సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించినప్పటికీ కూటం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇద్దరు పని చేస్తున్న పీహెచ్సీలలో ప్రస్తుతం ఒక్క డాక్టర్ని ఉంచడం దిగువ స్థాయిని సిబ్బందిని నియమించకపోవడం దురదృష్టకరమని ఎంపీపీ దాసు ఆక్షేపించారు. బట్టిగల్లూరు పీహెచ్సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు డిప్యూటేషన్‌పై భర్తీ చేయగా సదరు ఉద్యోగి విధులకు ఎందుకు రావడం లేదని ఎంపీపీ నిలదీశారు.

### తాగునీటిపై ..

తాగునీటిపై జరిగిన చర్చలో గత ప్రభుత్వం ఉద్దానం ప్రాంతానికి వరంలా రూ.700 కోట్లతో వంశధార నదీ జలాలు శుద్ధి చేస్తూ పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలకు అందించగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కొళాయిలు కల్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. బారువ, మామిడిపల్లి తీర గ్రామాల్లో అనేక చోట్ల పాత ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని తొలగించాలని సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని కోరారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖపై జరిగిన చర్చలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ బిరుసువాడలో అక్రమ నిర్మాణాలపై ఏళ్ల తరబడి ఫిర్యాదులు చేస్తున్న అధికారులు తప్పించుకుంటున్నారని ఆరోపించారు. సోంపేట పంచాయతీలో చెరువుల ఆక్రమించుకుంటూ పునాదులు రోడ్లు నిర్మిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోంపేట ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్ సీత సాగరం ఆక్రమణలపై సమావేశంలో ఎంపీడీవోకు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు.

మండలంలో పలువురు చేనేత కార్మికులకు బియ్యం అందకపోవడంపై సభ్యులు.. డీటీ మహేష్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ విషయంలో ఇటు మండల పరిషత్, అటు రెవెన్యూ శాఖల నిర్లక్ష్యం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు, ప్రత్యేక ఆహ్వానితుడు పాల్గొన్నారు.



## వ్యాపారుల లబ్ధి కోసమే కోల్డ్ స్టోరేజ్


### -ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు



**పలాస, డిసెంబరు 23(వార్త):** పలాస నియోజకవర్గంలో వ్యాపారుల లబ్ధి కోసమే కోల్డ్ స్టోరేజ్ ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు వెల్లడించారు. పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయలో 2025-26 సం.ర 4వ సాధారణ సమావేశము మల్లా శ్రీనివాస రావు అధ్యక్షతన మంగళవారం మార్కెట్ కమిటీలో నిర్వహించారు. ఈ సమావేశములో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యాలయ పరిధిలో గల మందస మండలము నందు గల దామోదర్ సాగర్ ఆయుకట్టు సుమారు 250 హెక్టార్ల విస్తీర్ణము గల భూమికి సాగు నీరు అందించుటకు గానూ 5 కోట్లు నిధులు మంజూరు చేయించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాకి వ్యవసాయ మార్కెట్ కమిటీ, పలాస పాలకవర్గము తరపున ధన్యవాదములు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి బిజినెస్ ర్ఫార్మర్ అఫ్ ది ఇయర్ గా ఎకనామిక్ టైమ్స్ అవార్డ్ పొందినందుకు పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గము తరపున ధన్యవాదములు తెలియజేశారు. పలాస యార్డు నందు పద్మనాభపురం శివాజీనగర్ కొలనీకి వ్యవసాయ మార్కెట్ కమిటీ, వెళ్ళే దారి యందు సుమారు 5 సెంట్లు మార్కెట్ కమిటీ స్థలము మున్సిపాలిటీ పలాస-కాశీబుగ్గకి ప్రభుత్వ ఉత్తర్వులు ననుసరించి స్థలము యొక్క ఖరీదు చెల్లింపు ప్రాతిపదికపై అప్పగించడమైనదని తీర్మానించారు. ఇందులో ప్రస్తుత పాలకవర్గమునకు ఎటువంటి ప్రమేయము లేదని, అయినప్పటికి సదరు స్థలము యొక్క ఖరీదును మున్సిపాలిటీ నుండి వసూలు చేయుట కొరకు ఈ కమిటీ చర్యలు తీసుకొనడమైనదని, సదరు స్థలము సర్వే నంబరు ననుసరించి సబ్ రిజిస్టర్ కార్యాలము, తాహసీల్దారు నిర్ణయించిన సొమ్ము చెల్లించవలసినదిగా కోరుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వారికి లేఖ పంపించడమైనది. పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయ పరిధిలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలములలో పరిసర ప్రదేశముల యందు కోల్డ్ స్టోరేజీ లేనందున ఈ నియోజకవర్గ పరిధిలోని రైతులు, వ్యాపారుల యొక్క ఉపయోగార్థము కోల్డ్ స్టోరేజీ (శీతల గిడ్డంగి) నిర్మించుటకుగాను ప్రతిపాదనలు తయారు చేసి ఆమోదము కొరకుసంచాలకులు, వ్యవసాయ మార్కెటింగ్, ఆంధ్రప్రదేశ్ గుంటూరుకి సమర్పించుటకు కమిటీ నందు తీర్మానించడమైనది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రెటరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్విజ్ పోటీల విజేత ఇన్నేసుపేట

**ఇచ్ఛాపురం, డిసెంబరు 23(వార్త):** ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం ప్రాథమిక పాఠశాలలో మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో 23 పాఠశాలల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా స్క్రీనింగ్ టెస్ట్ చేయించి పది పాఠశాల విద్యార్థి విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. ఐదు రౌండ్లు క్విజ్ నిర్వహించి ఇందులో ప్రథమ స్థానంలో ప్రాథమిక పాఠశాల ఇన్నేసుపేట ద్వితీయ స్థానంలో ప్రాథమిక పాఠశాల డొంకూరు తృతీయ స్థానంలో ప్రాథమిక పాఠశాల బలరాంపురం నిలిచారు. ముందుగా స్క్రీన్ టెస్ట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోళ్ల ధనలక్ష్మి, శ్రావణి ఆధ్వర్యంలో కె స్వాతి, ఎస్ మీనాక్షి, బి రాజేశ్వరి, ఆర్ జయలక్ష్మి, రోషిని, ముభినా, ఎంఈఓ 1 కే అప్పారావు, ఎంఈఓ2 విశ్వనాధం పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ బోర పుష్ప, పిఎసిఎస్ అధ్యక్షులుపేదిని బాబ్జి, పంచాయతీ సర్పంచ్ కారింగి త్రినాథ్ రెడ్డి, మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ అధ్యక్షులు రంగాల జానకి రామ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య మాస్టర్, కోశాధికారి కొప్పల హేమంత్, సభ్యులు దేవేందర్ రెడ్డి, బోర రామారావు రెడ్డి, కొత్త లావణ్య రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ దూపాన రాజేశ్వరి, వైస్ చైర్మన్ మమతారెడ్డి, దూపాన సత్యవతి, కొయ్య నిరోషా, రాధా, పంది రోజా దూపాన నూకరాజు, దూపన నారాయణ, ఎదురు కేదారి, దక్కత మోహనరావు, కొయ్య రామ్మూర్తి, దక్కక వాసు తదితరులు పాల్గొన్నారు.



## రైతులను గౌరవంగా చూడండి



**జి.సిగడాం, డిసెంబరు 23(వార్త):** భారతదేశ అభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్నారని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు పేర్కొన్నారు. జి.సిగడాం మండలం పాలఖండ్యాం గ్రామంలో సర్పంచ్ దారబోయిన రెయ్యమ్మ సమక్షంలో మంగళవారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.దేశ శ్రేయస్సుకు రైతులు పునాది అన్నారు. రైతులను ప్రతి ఒక్కరూ గౌరవంగా చూడాలన్నారు .వ్యవసాయ శాస్త్ర వేత్తల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల శ్రమ దేశాన్ని పోషి స్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిల బెడుతుందన్నారు. ఇది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టు కోవాలన్నారు. అన్నం పెట్టే రైతన్న లేకపోతే ఆకలలి తీరదన్నారు. అన్నదాత ఆరుగాలం కష్టపడి తేనే మన కడుపు నిండు తుందని తెలిపారు.ఈ ప్రాంత యువత చేసుకున్న అదృష్టమన్నారు.అనంతరం సర్పంచ్ ప్రతినిధి దారబోయిన దర్మరాజు, చల్లా రమణ, పక్కి ప్లహాదరావు, పోతల త్రినాథ కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ సమన్వయ కర్త దేబార్కి సూర్యనారాయణ, మెట్ట రాజు, జాడ రామసాయి తదితరులు పాల్గొన్నారు.

## యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నరసన్నపేట మండలం బొరిగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్టడీ అవర్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఎంఈఓ వారి విద్యాభ్యాస పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్ఫలితాలు సాధించే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని, ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వస్తువుల కొనుగోలులో రసీదు తప్పనిసరిగా పొందాలి



**పోలాకి, డిసెంబరు 23(వార్త):** వినియోగదారులు వివిధ రకాల షాపుల్లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు పొందాలని పోలాకి మండలం విద్యాశాఖ అధికారి సుగ్గు శ్రీనివాసరెడ్డి సూచించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమంగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తూనికలు, కొలతలలో మోసాలు జరుగుతున్నాయని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్యాకింగ్ చేసిన వస్తువులపై ఉన్న తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీలను తప్పకుండా పరిశీలించాలని సూచించారు. రసీదు పొందడం ద్వారా వినియోగదారుల హక్కులు పరిరక్షించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వినియోగదారుల సమైక్య ప్రధాన కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో రైతన్న గగ్గోలు

### - వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారు
### - మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్ఎన్ పేట/ హిరమండలం, డిసెంబరు 22(వార్త):** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంలా మారిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు.. వ్యవసాయంపై ఎన్నికలకు ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఒకవైపు పంటల కొనుగోలు లేక, మరోవైపు కనీస మద్దతు ధర దక్కక రైతాంగం పూర్తిగా కుదేలవుతోందన్నారు అన్నదాతను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం ఒక పండుగలా సాగిందని విత్తనాల పంపిణీ నుంచి పంటల అమ్మకం వరకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు రైతులకు వెన్నుదన్నుగా నిలిచాయన్నారు జగన్ మోహన్ రెడ్డి వీటిని ఏర్పాటు చేశారన్న అక్కసుతోనే, చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు ఆర్బీకేలను నిర్వీర్యం చేసి రైతు సేవ కేంద్రంగా పేర్లు మార్చి రైతన్నలు పండించిన పంటను అమ్ముకోలేని పరిస్థితి ఈ కూటం ప్రభుత్వం చేస్తుందన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన రైతులు విత్తనాలు, యూరియా కోసం గంటల తరబడి క్యూ కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని, రైతులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, రైతులను ఆదుకోవాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.




## గొల్లగండి బీచ్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించండి

### - ఎమ్మెల్యే అశోక్‌కు వినతి



**సోంపేట, డిసెంబరు 23(వార్త):** పల్లి గొల్ల గండి గ్రామం నుంచి సముద్రపు ఒడ్డున బీచ్ కు విద్యుత్ స్తంభాలు వేయించి విద్యుత్ లైట్లతో మరింత సౌకర్యం కల్పించాలని మాజీ ఎంపీటీసీ నిట్ట గోపాలు, కోదండరావ్ తదితరులు మంగళవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోకుని కలసి వినతి పత్రం అందజేశారు. ఆరు విద్యుత్ స్తంభాలతో, కేబుల్ వైర్‌తో ఈ కార్యక్రమం పూర్తి కాగలదని తెలిపారు. ఈ కార్యక్రమం చేపడితే బీచ్ మరింత సౌకర్యవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే వద్ద పేర్కొన్నారు. త్వరగా అంచనాలు వేయించి ఈ కార్యక్రమం తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు.

## సీతారాం మరణం ఉద్యమాలకు తీరని లోటు



**మందస, డిసెంబరు 23(వార్త):** కామ్రేడ్ నర్తు సీతారాం ఆకస్మిక మరణం ఉద్యమాలకు తీరని లోటని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మాజీ సభ్యుడు, కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ అన్నారు. మందస మండలంలోని లొహరిబంద పంచాయతీ గొల్లలపాలెం గ్రామంలో నిర్మించిన కామ్రేడ్ నర్తు సీతారాం స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ ఉద్దాన ఉద్యమాలకు ఊతమిచ్చే సీతారాం ఇకలేరన్న వాస్తవాన్ని ఉద్దానం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా, రైతు, ఉద్దాన, కిడ్నీ తదితర సమస్యలపై సీతారాం చూపిన పోరాట పటిమ మరవలేనిదన్నారు. ఉద్దానం ఉద్యమాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని, గొప్ప ప్రజా ఉద్యమ నాయకుడని, ఉత్తరాంధ్ర జనశక్తి నాయకునిగా, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకునిగా.. చేసిన పోరాటాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. రాబోయే తరాలకు సీతారాం చేసిన సేవలకు గుర్తుగా అమరవీరుల స్థూపం నిర్మించడం అభినందనీయమని, భవిష్యత్ తరాలకు గుర్తుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మడియా రామకృష్ణ, దున్న హరికృష్ణ, నారాయణపురం పంచాయతీ సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, కామ్రేడ్ నర్తు సీతారాం కుమారుడు నర్తు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అమృత కలశాలు



**సోంపేట, డిసెంబరు 23(వార్త):** కవిటి మండలం రాజపురం కు చెందిన శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం మూడు నిరుపేద కుటుంబాలకు అమృత కలశం పేరిట నిత్యావసర సరుకులను అందజేశారు. రాజపురం పంచాయతీలో సూరిపుట్టుగా గ్రామంలో సూరి రాజు కుటుంబానికి, కవిటి పంచాయతీ డొంక పుట్టుక గ్రామంలో డొంక సావిత్రి కుటుంబానికి, రాజపురంలో మంటమ్మ కుటుంబానికి వంట సరుకులు అందించి ఆదుకున్నారు.

## సవరకొంకడాపుట్టిని పంచాయతీగా చేయాలి

**మందస, డిసెంబరు 23(వార్త):** కొంకడాపుట్టి పంచాయతీ నుంచి సవరకొంకడా పుట్టితో పాటు మరికొన్ని గ్రామాలను వేరు చేసి, సవరకొంకడాపుట్టి పంచాయతీని ఏర్పాటు చేయాలని జనసేన మందస మండల ఉపాధ్యక్షుడు సవర శివ డిమాండ్ చేశా రు. కొంకడాపుట్టి పరిధిలో కుల్లోగాంకాలనీ, సంధిగాం, కిల్లోయికాలనీ, సవరబుర సాయి, కొత్తవీధి గ్రామాల నుండి సవరకొంకడాపుట్టి పంచాయతీ ఏర్పాటు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఆయన విన్నవించారు. గిరిజనులకు అందాల్సిన నిధులు సరైన అవకాశాలు లేకపోవడంతో లభించడంలేదని, అంతేకాకుండా గిరిజనులకు సబ్సిడీ, ఎస్టీ నిధులు, ఇతర అవకాశాలు లభ్యంకావడంలేదన్నారు. గిరిజనులకు అందాల్సిన పథకాలు, నిధులు, సబ్సిడీలను గిరిజనేతరులు దక్కించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రస్తుతం పంచాయతీల విభజనకు ప్రభుత్వం సుముఖతగా ఉండడంతో సవరకొంకడాపుట్టి పంచాయతీని ఏర్పాటు చేయాలన్నారు. సవర శివతో పాటు ఆయా గ్రామాల గిరిజన నాయకులు కూడా ఉన్నారు.



## మహిళా మార్టుల అభివృద్ధికి సమష్టి కృషి

### -డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్



**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళా మార్టుల అభివృద్ధికి సిబ్బంది అన్ని విధాలుగా సహకరించాలని డీఆర్డీఏ పీడీ పెద్దింటి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం నరసన్నపేటలోని వెలుగు కార్యాలయంలో సీసీ, సీఎఫ్ తదితర మహిళా సభ్యులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, స్వయం ఉపాధి సాధన దిశగా మహిళలను మరింత ప్రోత్సహించేందుకు మహిళా మార్టులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ నెల 24వ తేదీన నరసన్నపేటలో ఏర్పాటు చేసిన మహిళా మార్టును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించనున్నారని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు, నాణ్యత, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఐ శత జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలి



**సారవకోట, డిసెంబరు 23(వార్త):** సీపీఐ శత వసంత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం సారవకోట మండలం బొంతుగూడ గ్రామంలో సీపీఐ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తూ ముందుకు సాగుతున్న పార్టీగా సీపీఐ గుర్తింపు పొందిందన్నారు. కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పార్టీ చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. శతజయంతి వేడుకలను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న శతజయంతి సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శత జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేట మండలం లుకలాం గ్రామ సమీపంలో నరసన్నపేట%-%శ్రీకాకుళం ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సదుపాయాలు మెరుగుపడటం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో సులభమైన ప్రాప్యత లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం చేయడం ద్వారా ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సు ప్రారంభంతో నరసన్నపేట మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఆర్టీసీ డీఎం, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## జాతీయ వినియోగదారుల దినోత్సవ ర్యాలీ

**పలాస, డిసెంబరు 23(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలాస వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినియోగదారుల హక్కుల పరిరక్షణపై నినాదాలు చేస్తూ పట్టణంలోని పలాస మోర్ సూపర్ మార్కెట్, అపోలో మెడికల్ ఫార్మసీలను సందర్శించారు. అక్కడ వినియోగదారులను కలిసి వారు కొనుగోలు చేస్తున్న వస్తువుల నాణ్యత, తయారీ తేదీ (మ్యానుఫ్యాక్చరింగ్ డేట్), గడువు తేదీ (ఎక్స్పైరీ డేట్)లను తప్పనిసరిగా పరిశీలించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, లోపాలు, మిసలాటు వంటి సమస్యల నుండి రక్షణ అందించడానికి జాగృత్తి పెంచుతుందని తెలిపారు.

కార్యక్రమంలో వాణిజ్య విభాగాధిపతి పి.వెంకటరమణ, సైన్స్ విభాగాధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్, డాక్టర్ వై.వెంకటలక్ష్మి, లైబ్రేరియన్ బి.నరసింహులు, అధ్యాపకులు శంకర్, హేమరాజు, శ్రీను, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తదితరులు పాల్గొన్నారు.



## ముద్దాయిలకు వైద్య సేవలందించాలి



**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** సబ్ జైలులో ఉన్న ముద్దాయిలకు తప్పనిసరిగా వైద్య సదుపాయాలు అందించాలని జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ కార్యదర్శి హరిబాబు సూచించారు. మంగళవారం నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక సబ్ జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ముద్దాయిలను ప్రశ్నిస్తూ వారి ఆరోగ్య పరిస్థితులు, వైద్య సేవల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో ఉన్న మౌలిక వసతులు ఏ విధంగా ఉన్నాయో ఖైదీలను అడిగి సమాచారం సేకరించారు. అనారోగ్య సమస్యలున్న ముద్దాయిలకు తక్షణ వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించారు. హరిబాబు మాట్లాడుతూ, న్యాయసహాయం అవసరమైన ముద్దాయిలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైదీల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారికి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

## రబీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** ఖరీఫ్ అనంతరం కొనసాగుతున్న రబీ సీజన్లో రైతులు తప్పనిసరిగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ శాఖ అధికారి సూర్య కుమారి, ఉద్యానవన శాఖ అధికారి ఆమని సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం రావులవలస రైతు సేవ కేంద్ర పరిధిలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్లో ప్రస్తుతం ఆరుతడి పంటలు కొనసాగుతున్నాయని, పంట అవసరాన్ని మించి ఎరువులు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు నేల ఆరోగ్యం కాపాడబడుతుందని తెలిపారు. అలాగే నీటి వినియోగంలో మితవ్యయం పాటించడంతో పాటు, సమయానికి సాగు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

## తిమడాంలో స్వామిత్ర సర్వే నిర్వహణ



**జలుమూరు, డిసెంబరు 23(వార్త):** తిమడాం గ్రామంలో స్వామిత్ర సర్వేను మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఎంపీడీవో చిన్నప్పుడు ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది ఈ సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని గృహాలకు కొలతలు వేసి హద్దులను ఖరారు చేస్తూ ఇంటి పట్టాల మంజూరుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సర్వే ద్వారా హక్కుదారులకు అధికారికంగా ఇంటి పట్టాలు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. పట్టాల మంజూరుతో గ్రామస్తులకు తమ ఆస్తులపై చట్టబద్ధమైన హక్కులు లభించడంతో పాటు భవిష్యత్‌లో ఆస్తి వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇంటి పన్నులను సక్రమంగా నిర్ధారించేందుకు కూడా ఈ సర్వే ఉపయోగపడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొని సర్వే పనులను పర్యవేక్షించారు. గ్రామాభివృద్ధికి స్వామిత్ర సర్వే కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.


## చీడివలస వద్ద రహదారి పనులకు శ్రీకారం



**పోలాకి, డిసెంబరు 23(వార్త):** చీడివలస గ్రామం వద్ద రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ ముద్దాడ బైరాగినాయుడు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఈ రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాబార్డ్ నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం కోటి రూపాయల అంచనా వ్యయంతో రహదారి అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎంపీపీ వెల్లడించారు. చీడివలస నుంచి నరసన్నపేట దేశవానిపేట వరకు ఈ రహదారి నిర్మాణం జరగనుందని, పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రహదారి అభివృద్ధి పనులకు మద్దతు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి తమ కృషి కొనసాగుతుందని ఎంపీపీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## నౌతలలో విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

**సారవకోట, డిసెంబరు 23(వార్త):** విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వాటిని మరింత మెరుగుపరిచే దిశగా నిరంతరంగా కృషి చేస్తున్నామని ఎంఈఓ మద్దు వెంకటరమణ తెలిపారు. మంగళవారం సారవకోట మండలం నౌతల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మూడవ తరగతి విద్యార్థుల తెలుగులోని చదవడం, మాట్లాడే సామర్థ్యాలను నేరుగా ప్రశ్నలు అడిగి పరిశీలించారు. విద్యార్థులు మంచి సామర్థ్యాలను ప్రదర్శించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను ఎంఈఓ పరిశీలించి, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ విద్య లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## నా మాటలను వక్రీకరించారు : ధర్మాన కృష్ణదాస్



**నరసన్నపేట, డిసెంబరు 23(వార్త):** తన మాటల్లో స్వార్థం ఎప్పుడూ ఉండదని, తాను ఎవరినీ కించపరిచే వ్యక్తిని కాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు. ఇటీవల టెక్కలిలో జరిగిన ఒక కార్యక్రమంలో తాను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఉద్దేశించి అనుచితంగా వ్యాఖ్యానించారంటూ కొందరు కావాలని తన మాటలను వక్రీకరించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నరసన్నపేట నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ్మినేని సీతారాంను కించపరిచే ఉద్దేశంతో తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తమ ఇద్దరి మధ్య బావ%-%బావమరిది బంధం ఉందని గుర్తుచేశారు. పరస్పర గౌరవం, ఆత్మీయతతో కొనసాగుతున్న సంబంధాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించడం సమంజసం కాదని పేర్కొన్నారు. తన ప్రజా జీవితంలో ఎప్పుడూ సంయమనం పాటించానని, వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకుండా ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ధర్మాన కృష్ణదాస్ తెలిపారు.

# భూకామందుల ఆగడాలు



**-పలాసలో పెచ్చు మీరుతున్న ఆకృత్యాలు**

**- వేరే వారి పోలంలో కూలీలతో వరి నూర్పులు**

**-ధాన్యపు రాశుల తరలింపు ఆక్రమణదారులు**

**-గతంలో బెదిరించి వారే దారుణానికి పాల్పడ్డారంటున్న బాధితులు**

**-పోలీసులకు ఫిర్యాదు**

**-తక్షణ చర్యలు తీసుకున్న ఖాకీలు**



**పలాస, డిసెంబరు 23(వార్త):** పలాసలో ల్యాండ్ మాఫియా ముఠా ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. పలాస మండలం పారసంబ రెవెన్యూ పరిధిలో మధుర లక్ష్మి, చొక్కర పార్వతిల దఖలు పడిన ఆస్తిలో సర్వే నెంబర్ 184/1 లో 2.65 ఎకరాల్లో పండిన వరి కుప్పలను కబ్జాదారుల ప్రోద్బలంతో కూలీలు నూర్పు చేసి పోగువేసిన పెద్ద మొత్తంలో దాన్యపు రాశులను పట్టుకుపోయారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. 112 కు కాల్ చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. కాశీబుగ్గ పోలీసులు స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమ వరి నూర్పులు నిలుపు దల చేశారు. అక్రమంగా నూర్పులు వేసిన వారంతా పోలీసు స్టేషన్ కు రావా లని పోలీసులు కోరారు. గతంలో తమను బెదిరించిన వ్యక్తుల ప్రోద్బలంతోనే గంగువాడ, కేదారి పురం మెళియా మండలాలకు చెందిన కూలీలతో వరి కుప్పల నూర్పులు చేసి 20 బస్తాల ధాన్యంను దొంగతనంగా వారు ఎత్తు కెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు చొక్కర మధుర లక్ష్మి , చొక్కరపార్వతి పేర్కొన్నారు. గతంలో తమను బెదిరించిన పలాస, పారసంబ, గంగువాడ, పల్లిసారథి, పాతపట్నంకు చెందిన భూ బకాసురులు సిండికేట్ గా ఏర్పడి తమ అనుచరులతో ఈ దారుణానికి ఒడిగట్టారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. పోలీసులు భూబకాసురులపై చర్యలు తీసుకుని, కబ్జాదారుల నుంచి తమకు రక్షణ కల్పించి, దొంగతనానికి గురైన తమ ధాన్యపు రాశుల బస్తాలను ఈ ఏడాది పండించిన వరి పంటను తమకు అప్పగించి న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లక్ష్యసాధనలో సిక్కోలు

## జిల్లా ముందుండాలి

*** గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య రంగంలో మంచి ఫలితాలు సాధించాలి * మధ్యాహ్న భోజన పథకాలతో తగ్గిన డ్రాపౌట్లు * పీఎంశ్రీ - మన బడి మన భవిష్యత్‌తో పాఠశాలలో సదుపాయాలు * ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు చైర్మన్ లంకా దినకర్ * ఆయా శాఖల అధికారులతో జడ్పీలో సమీక్ష**

**శ్రీకాకుళం, డిసెంబర్ 23(వార్త):** స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలుకావాలని ఇరవై సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి 'విబి జీ రామ్ జీ', వైద్య ఆరోగ్యం, విద్యాకు సంబంధించిన పథకాలు, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకంలో అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. పని దినాలు 185 రోజులకు పెంచడం జరిగిందన్నారు. ఈ పథకం కింద అత్యధిక నిధులు శ్రీకాకుళం జిల్లాకు తేవడానికి ప్రణాళికలు రచించాలని సూచించారు. పీఎం మాతృవందన యోజన, జననీ సురక్షా యోజన, జననీ శిశు సంరక్ష కార్యక్రమం, రాష్ట్రీయ కిషోర్ స్వస్త కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఎన్టీఆర్ వైద్య సేవ, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ భోజన పథకం, పీఎం శ్రీ, జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. బహుళ ప్రయోజనాల పీఎం సూర్యఘర్ పథకం అమల్లోనూ మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద ప్రతి 15 రోజులకు గర్భిణీలకు అన్ని పరీక్షలు చేస్తున్నామన్నారు. జననీ శిశు సంరక్ష కార్యక్రమం ద్వారా ఉచిత పౌష్టికాహారం, మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కింద మొదటి కాన్పు సమయంలో 5 వేల రూపాయలు రెండు వాయిదాలలో అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కాన్పు అయితే మరో వెయ్యి రూపాయలు కలిపి ఇస్తున్నామని చెప్పారు. రెండవ కాన్పులో ఆడ శిశువుకు జన్మనిస్తే 6 వేలు ప్రోత్సాహకంగా నగదు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఐదు కేంద్రాలలో 459 మంది రోగులకు 70 పరికరాల ద్వారా 70 పడకలతో 37,196 సెషన్ల డయాలిసిస్ సేవలు అందించామన్నారు. 894 స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం కింద జిల్లాలో పాఠశాలలో 1.03 లక్షల మందికి పరీక్షలు చేయగా, 5718 మందికి కళ్ళ జోడులు అవసరం అవ్వగా అందరికి అందించడం జరిగిందన్నారు. మరో 6 మందికి ఈ సంవత్సరం ఇప్పటివరకు కంటి ఆపరేషన్లు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర సగటు 18 కాగా, శ్రీకాకుళం జిల్లా సగటు 6.11గా నమోదైందన్నారు. టీబీ వ్యాధి సోకిన వారికి వ్యాధి నిర్ధారణ అవ్వగానే మొదట 3,000 రూపాయిలు, 3 నెలల తర్వాత మరో 3000 రూపాయలు సహాయం చేయడంతో పాటు పోషక ఆహారం కోసం నెలకు 1000 రూపాయిలు చొప్పున నిక్షయ పోషణ్ యోజన కింద అందిస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ – ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన – డా. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా జిల్లాలో 2024 లో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు 380 కోట్ల ఖర్చుతో 2.11 లక్షల మందికి వైద్య సేవలు అందాయన్నారు. 108 వాహనాలు ('31), 104 వాహనాలు (31), 102 వాహనాలు (18) ద్వారా సేవలందుతున్నాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 7.03 లక్షల అర్హులైన వారికి ఇప్పటివరకు పీఎంజేఏవై కార్డులు పంపిణీ చేశామని అధికారులు తెలియజేయగా, మిగిలిన వారికి కూడా సత్వరం పంపిణీ చేయాలని లంకా దినకర్ ఆదేశించారు. అలాగే, 70 సంవత్సరాలు పైబడిన వారు 1.91 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే ఇప్పటి వరకు 31 వేల మంది మాత్రమే కార్డులు తీసుకున్నారన్నారు. పెద్ద వయస్సు రీత్యా కార్డులను వారి వద్దకే వెళ్లి ప్రక్రియ పూర్తి చేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. తల్లికి వందనం కింద జిల్లాలో 2.55 లక్షల మంది విద్యార్థులకు 600 కోట్లు సహాయం అందిస్తున్నామని అధికారులు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ – సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ద్వారా ఎలిమెంట్రీ నుండి సెకండరీ విద్యా వరకు 1.59 లక్షల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్, టెక్స్ట్ పుస్తకాలు, ఆక్స్ఫర్డ్, ఇతర డిక్షనరీలు, విద్యార్థులకు బ్యాగ్, యూనిఫామ్ , షూ, బెల్ట్ పంపిణీ తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. మన బడి – మన భవిష్యత్తు – పీఎం శ్రీ యోజన ద్వారా 17 మోడల్ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం లక్ష్యంగా సురక్షిత త్రాగు నీరు, స్వచ్ఛత కోసం మరుగుదొడ్లు, భవనాలు, ఫర్నిచర్ ఆధునీకరణ నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం – పీఎం పోషణ్ కింద నాణ్యమైన సన్న బియ్యంతో జిల్లాలో జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పాఠశాలలో 1.56 లక్షల విద్యార్థులు ఉండగా, అందులో 1.45 లక్షల మంది విద్యార్థులకు వారంలో 5 రోజులు కోడి గుడ్డుతో పౌష్టికాహార మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం తయారు చేసిన స్థలం వద్ద పరిశుభ్రత, తదితర విషయాలపై అధ్యక్షులకు వివరించారు. స్కూల్ హెల్త్ వెల్నెస్ ప్రోగ్రామ్ కింద ఆరోగ్య, విద్యా శాఖ సమన్వయంతో కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ అమలు కింద హెల్త్ స్క్రీనింగ్, పోషక విలువలతో కూడిన మాత్రలు, ఆరోగ్య పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమాలు ముందస్తు వ్యాధినిరోధక చర్యలు ధ్యేయంగా చేపడుతున్నామన్నారు. జవహర్ బాల ఆరోగ్య రక్ష కింద విటమిన్ ఏ, డి టాబ్లెట్లు సంవత్సరానికి రెండు సార్లు, ఐరన్ మరియు పోషక విలువలు తగ్గి రక్తహీనత ఉన్న విద్యార్థులకు తగిన పోషక విలువలను అందించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, డ్వామా పీడీ లవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి రవి కుమార్, ఎపిఈపీడిసియల్, సమగ్ర శిక్ష, తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, తాగునీరుకు ప్రాధాన్యమివ్వండి

**-ఎమ్మెల్సీ నర్తు రామారావు**




**సోంపేట, డిసెంబరు 23(వార్త):** సమాజంలో అన్నిటికన్నా ముఖ్యంగా విద్య వైద్యం తాగునీరు వంటి అంశాలకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. సోంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంగళవారం గౌరవ సభ్యునిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఈ మూడు అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మన ప్రాంతానికి వంశధార నది జలాలను తాగునీటి పథకం ద్వారా తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే నాడు నేడు ద్వారా పాఠశాలను శిథిలావస్థ నుంచి ఆధునీకరణ చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన అభివృద్ధిని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇటువంటి ప్రాధాన్యత అంశాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. బారువాలో ప్రభుత్వ ఆసుపత్రి దాదాపు 90 శాతం గతంలో పూర్తికాగా మిగతా కొద్ది పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే 700 కోట్ల రూపాయలు హెచ్చించి తెచ్చిన మెగా వాటర్ ప్రాజెక్టు సంబంధించి చిన్న చిన్న సమస్యల పరిష్కారం లోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ఫౌంటెన్‌ను తలపిస్తున్న ఉద్దానం పైపు లీకేజ్

**-నిద్రపోతున్న మున్సిపాలిటీ అధికారులు**



**పలాస, డిసెంబరు 23(వార్త):** గుప్పెడు నీరు కోసం అల్లాడిపోతున్న తరుణంలో పలాస మున్సిపాలిటీ అధికారులు ఫౌంటెన్ల చిమ్ముతున్న ఉద్దానం త్రాగునీరు పైప్ లీకేజ్ అవుతున్న అధికారులు నిద్రపోతున్నారని పట్టణవాసులు మండిపడుతున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజల దాహార్తినితీర్చే ఉద్దానం త్రాగునీరు ప్రధాన పైప్ లైన్ పాడై గత నెలరోజులుగా నీరు వృధా అవుతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుక్కెడు నీరు కోసం ప్రజలు నిత్యం అల్లాడిపోతున్న వేళ నీరు ఏరులైపారుతూ వృధా అవుతుంటే మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని ప్రజల గగ్గోలు పెడుతున్నారు. పలాస ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో ఉద్దానం త్రాగునీరు ఉంటాను ప్రధాన పైప్ లైన్ ఫౌంటెన్ల త్రాగునీరు వెదజల్లుతున్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో చాలా మాత్రం కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. త్రాగు నీరు లీకై నీరు వృధా అవుతుండడం చూస్తున్న ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి నీరు వృధా కాకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఆ ప్రాంతమంతా నదిలో తలపిస్తూ కనిపిస్తుందని ప్రజలు పడుతున్నారు.

## పలాసను జిల్లాగా ప్రకటించాలి

**పలాస, డిసెంబరు 23(వార్త):** పలాసను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ అన్నారు. జీడి కార్మికులతో మంగళవారం మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, వికేంద్రీకరణ, ప్రజలకు పరిపాలన దగ్గర చేయాలనే ఉద్దేశంతో 13 జిల్లాలను 29 జిల్లాలుగా విభజించారని అన్నారు. ఇది తప్పు కాదని, ప్రజలకు సౌలభ్యం, సమాన హక్కులు, అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయమేనని అన్నారు. వెనుకబడిన జిల్లా శ్రీకాకుళానికి ఒకటిగా ఉంచడం న్యాయం కాదన్నారు. ముందుగా ప్రకటించినట్టుగా పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రం నుంచి రెండు వాటాలు, రాష్ట్రం నుంచి కూడా సమాన నిధులు లభిస్తాయన్నారు. దీంతో వెనుకబాటుతనం తొలగుతుందన్నారు. ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లాల్సిన పని ఉండదని అన్నారు. అనంతరం షిరిడి సాయిబాబా మందిరంలో క్యాలెండర్‌ను అందజేస్తామన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**పలాస, డిసెంబరు 23(వార్త):** సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ ఎస్సై ఆర్ నరసింహమూర్తి ప్రజలకు వివరించారు. కైజోల గ్రామంలో మంగళవారం రాత్రి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ క్రైమ్ మోసాల పట్ల, నారీ శక్తి అవేర్నెసస్, మహిళా భద్రత, బాల్య వివాహాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫిషింగ్, ఎస్ఎంఎస్ మోసాలు, బ్యాంకు లేదా ప్రభుత్వ అధికారులుగా పనిచేస్తున్నామని చెప్పి కేవైసీ లేదా లింకు లు పంపి ఖాతాలు ఖాళీ చేస్తారని చెప్పారు. డిజిటల్ అరెస్ట్, పార్సెల్ స్కామ్ లు, పార్సెల్‌లో డ్రగ్స్ ఉన్నాయని బెదిరించి డబ్బు డిమాండ్ చేస్తారని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, మెసేజులు క్లిక్ చేయకండని, సమాచారం ధృవీకరించుకోవాలని, పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ చేయకండని, ఖాతా లావాదేవీలు తరచూ చెక్ చేయవద్దని, త్వరగా డబ్బు పంపమని ఒత్తిడి చేస్తే నమ్మకండని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ పోలీసులు, కైజాల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఆదిత్యుని సన్నిధిలో చాగంటి

**అరసవల్లి, డిసెంబర్ 23 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్య నారాయణ స్వామిని మంగళవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరి దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానం ఆవరణలో ప్రత్యేక సూర్య నమస్కారాలు చేశారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి వారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.

## బాల్య వివాహంతో అనర్థం



**శ్రీకాకుళం, డిసెంబర్ 23 (వార్త):** బాల్య వివాహాలు సామాజిక శాపమని, వీటి వల్ల బాలికల భవిష్యత్తు అంధకారమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నల్సా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక వరం మున్సిపల్ హైస్కూల్‌లో బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు బాలికలకు రక్షణ కల్పించే వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని హరిబాబు పిలుపునిచ్చారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య, న్యాయపరమైన చిక్కులను విద్యార్థినులు గుర్తించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 29న పాలకొండలో జాబ్ మేళా

**పార్వతీపురం, డిసెంబర్ 23(వార్త):** పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు పార్వతీపురం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 28 సం.లు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొన వచ్చన్నారు. ఆరోజు ఉదయం 9గంటలకు పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళా శాలకు హాజరు కావాలన్నారు. 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. నిరుద్యోగులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 63012 75511,79937 95796 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని అన్నారు.

## మధ్యాహ్న భోజనం పథకం ఒక వరం




**నరసన్నపేట, డిసెంబరు 23 (వార్త):** ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఒక వరం లాంటిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ అన్నారు. వివిధ కారణాలతో ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకువచ్చేవారు కాదనీ, దీనివల్ల అనారోగ్య సమస్యలు, రక్తహీనత సమస్యలతో ఇబ్బంది పడే వారిని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ సహకారంతో అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ విద్యార్థులను సింగుపురంలోని అక్షయపాత్ర సంస్థ సందర్శనకు పంపించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు, కొన్ని కళాశాలలకు రుచికరమైన, శుచికరమైన భోజనం తయారు చేసి పంపిస్తున్నామనీ మేనేజర్ అహ్మద్ సంస్థ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. డీవీఈఓ ఆర్.సురేష్ కుమార్ ఆదేశాల మేరకు ఓజేటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు దుగ్గివలస రాంప్రసాద్ అధ్యాపకులు కొర్రాయి రవి పేర్కొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546